మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# వైద్యులు లేరు.. (వెల్‌నెస్ సెంటర్) మందులూ లేవు..

**డెంటల్ డాక్టరే దిక్కు..**
**ఆర్థోపెడిక్ సర్జన్**
**రెండు గంటలే డ్యూటీ**
**సిబ్బంది అంత**
**ఫోన్‌లో బిజీ బిజీ**
**వెల్నెస్ సెంటర్‌పై**
**పర్యవేక్షణ కరువు**



మందులు లేవు అని క్రాస్ మార్క్ చేసిన ఓ పేషెంట్ ప్రిస్క్రిప్షన్




వెల్నెస్ సెంటర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 14, ప్రభాతవార్త :** ఉద్యోగులకు, పెన్షనర్లకు, జర్నలిస్టులకు తక్షణమే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో వెల్నెస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు అవడంతో వెల్ నెస్ సెంటర్లు నామ మాత్రంగా కొనసాగిస్తున్నారు. వైద్యులు అసలే లేరు. కనీసం మందులు కూడా దొరకని పరిస్థితి నెలకొన్నది. సిబ్బంది కాదు వైద్యులు సైతం కంప్యూటర్ ఆపరేటర్లు సైతం నిత్యం ఫోన్లో రీల్స్ చూస్తూ బిజీగా ఉంటున్నారు. అంతేకాకుండా రోగులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉన్నత అధికారుల పర్యవేక్షణ కరువవడంతో వైద్యులు, సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఒకరోజు ఫుల్.. మూడు రోజులు నిల్...

మహబూబ్ నగర్ వెల్నెస్ సెంటర్ ప్రభుత్వ జనరల్ దవాఖానాలో కొనసాగుతున్నది. వెల్నెస్ సెంటర్లో ఒకరోజు మందులు దొరికితే వరుసగా మూడురోజులు ఉండవని పెన్షనర్లు ఆరోపిస్తున్నారు. ఒక రోగికి 8 రకాల మందులు అవసరం ఉంటే కనీసం రెండు రకాల మందులు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెల్నెస్ సెంటర్ కు 70కు పైగా పెన్షనర్లు వస్తుంటారు. సహజంగానే వారికి షుగర్, బీపీ లాంటి మందులు నిత్యం వాడాల్సి ఉంటుంది. అయితే షుగర్, బిపి మందులు కూడా అందుబాటులో ఉంచడం లేదని పెన్షనర్లు వాపోతున్నారు.



పేషెంట్ ను చూస్తూనే ఫోన్ మాట్లాడుతున్న దృశ్యం

### ఫోన్‌లో బిజీబిజీ..

అసలే వైద్యుల్ల కొరతతో వెల్నెస్ సెంటర్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు ఉన్న ఒకరిద్ద రూ వైద్యులు సిబ్బంది కూడా నిత్యం ఫోన్‌లో మాట్లాడుతూనే వైద్య సేవలు అందించడం గమ నార్హం. రోగి వ్యాధిని నిర్ధారించడానికి కనీసం ఒక జనరల్ ఫిజీషియన్ కూడా లేకపోవడం వెన్నెస్ సెంటర్ దుస్థితికి నిదర్శనంగా చెప్పవచ్చు.



ఫోన్లో బిజీగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్

### రక్త పరీక్షలు లేవు.. ఈసీజీ లేదు..

వెల్నెస్ సెంటర్లో రక్త పరీక్షలకు నమూనాలు సేకరించేవారు. గత కొన్ని నెలలుగా ఆ సేవలు బంద్ చేశారు. ఈసీజీ మిషన్ మూలకు పడేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన దూరం ప్రాంతాల నుంచి ఎవరైనా ఫోన్ చేసి సంప్రదించి రావాలంటే కనీసం ల్యాండ్ లైన్ నెంబర్ కూడా పనిచేయడం లేదు. ఒకటా రెండా ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ సమస్యలే.

### డిఎంఅండ్ హెచ్ఓ సార్ జర పట్టించుకోండి

ఉమ్మడిజిల్లాలోని దాదాపు 100 కిలోమీటర్ల దూరం నుంచి కూడా మహబూబ్‌నగర్ వెన్న సెంటరుకు నిత్యం పెన్షనర్లు, ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు వస్తుంటారు. వ్యయ ప్రయాస లకోర్చి తీరా వెల్నెస్ సెంటరుకు చేరుకున్నాక అక్కడ వైద్యులు లేక మందులు దొరకక వెనుదిరిగి వెళ్తున్నారు. మందులు షుగర్, బిపి, జ్వరం లాంటి వ్యాధులకు అయినా మందులను నిత్యం అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా వైద్యశాఖ అధికారిగా ఇటీవలే శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్యశాఖ అధికారి అయిన తమ గోడును విని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



ల్యాండ్ లైన్ నెంబర్ పనిచేయ కుండా రిసీవర్ పక్కన పెట్టిన దృశ్యం

# అప్రమత్తంగా ఉండాలి

**అతి భారీ వర్షాలపై జాగ్రత్తలు తీసుకోవాలి**
**అధికారులందరూ అందుబాటులో ఉండాలి**
**వాతావరణ పరిస్థితులపై**
**గ్రామాల్లో టాం..టాం.. వేయించాలి**
**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**
**ఆదేశం వెబెక్స్ ద్వారా సమీక్ష**



**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 14 ప్రభాతవార్త:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్క అధికారి అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్‌డిఓ, డిఆర్‌డిఓ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల ఎస్ఈ, డిఈ, ఈఈ, ఏఈ, ఎంపిడిఓలు, తహశీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. సమావేశంలో మండల స్థాయిలో తహసిల్దార్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆఫీసర్ అధికారిగా వ్యవహరిస్తారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు జారీ చేయడం జరిగింది. మండల స్థాయిలో గల లైన్ డిపార్ట్మెంట్ అధికారులు మండల స్థాయి డిజాస్టర్ అధికారి మండల స్థాయిలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసుకొని, గత సంవత్సరములో ఏమైనా సమస్యలు ఏర్పడినవి వాటిని ఏ విధంగా పరిష్కారం చేసుకున్నాం, ఈ సంవత్సరము సమస్యలు వస్తే ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి అనేవి చర్చించుకుని, ఏ సమస్యలు వచ్చినా పరిష్కారం చేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు గ్రామస్థాయి అధికారులు వర్షాకాలంలో ప్రజలకు తగు జాగ్రత్తలు విషయంలో వారి యొక్క కాంటాక్ట్ నెంబర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి గ్రామస్థాయిలో టామ్ టామ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని, తహశీల్దార్ ఎంపిడిఓలు గ్రామాల్లో గజ ఈతగాళ్లు ఎంతమంది ఉన్నారు వారి పేర్లు వారి ఫోన్ నెంబర్లతో సిద్ధంగా ఉండాలని, ఎక్కడైనా ఏదైనా అనుకోకుండా సంఘటనలు జరిగితే తక్షణమే వారి సహాయం తీసుకొని ప్రాణ నష్టం జరగకుండా చూసుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో -మిగతా4లో..



# నేటి నుంచి మోగనున్న బడిగంట

**53రోజుల వేసవి సెలవుల అనంతరం**
**తెరుస్తున్న పాఠశాలలు**
**పుస్తకాల బ్యాగులతో వడివడిగా**
**బడులకు వెళ్లడానికి విద్యార్థుల సన్నద్ధం**

**భూత్పూర్, జూన్ 14, ప్రభాతవార్త :** యాభై మూడ్రోజుల సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం సోమవారం జిల్లా వ్యాప్తంగా బడిగంట మోగనుంది. ఆటపాటలు, ఆటవిడుపులతో కాలాన్ని ఇట్టే నెట్టేసిన బాలలు నేటి నుంచి పుస్తకాల బ్యాగులతో బడులకు వెళ్లేందుకు సన్నద్ధమౌతున్నారు. ఆదిలోనే హంసపాదన్నట్లు ఈ నెల 12న తెరువనున్న బడులు 13న రెండోశనివారం, 14న ఆదివారం రావడంతో ప్రభుత్వం ఆనవాయితీగా జూన్ 12న తెరవాల్సిన బడులు రెండ్రోజుల అనంతరం తెరుచుకోనున్నాయి. సెకండ్ సాటర్‌డే, సండేలను దృష్టిలో ఉంచుకుని జూన్ 12కు బదులు 15నుంచి తెరవాలని రాష్ట్ర ప్రభుత్వ -మిగతా4లో..



# 20న జాతీయ లోక్ అదాలత్

**రాజీ మార్గమే రాజమార్గం**
**జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి**
**మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి**

**మహబూబ్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త :** జూన్ 20న నిర్వహించనున్న రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి పిలుపునిచ్చారు. ప్రజలకు త్వరితగతిన, సులభంగా తక్కువ ఖర్చుతో న్యాయం అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈలోక్ అదాలత్ -మిగతా4లో..

# తడిసిన ధాన్యానికి తక్షణ రక్షణ చర్యలు

**రైతులకు భరోసా ఇచ్చిన**
**కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**
**పెద్దాపూర్, లక్ష్మాపూర్ కొనుగోలు**
**కేంద్రాల ఆకస్మిక తనిఖీ**
**తడిసిన ధాన్యాన్ని వెంటనే**
**మిల్లులకు తరలించాలని ఆదేశం**
**యూరియా కొరత లేకుండా**
**ఆన్‌లైన్ సరఫరా**



పెద్దాపురం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**ఉప్పునుంతల, జూన్ 14 ప్రభాతవార్త :** జిల్లాలో ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండలంలోని పెద్దాపూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలుకేంద్రాలను ఆయన ఆదివారం ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిన విషయం తన దృష్టికి రావడంతో ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం పరిస్థితి, తేమ శాతం, తూకం ప్రక్రియ, హమాలీల ఏర్పాటు, రవాణా సదుపాయాలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా వెంటనే బాయిలర్ మిల్లులకు తరలించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం రవాణా వాహనాల ఏర్పాటును వేగవంతం చేయాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చూడాలని సూచించారు. ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా అదనపు టార్పాలిన్లు, రక్షణ కవర్లు ఏర్పాటు చేసి నిల్వలను కాపాడాలని అధికారులకు ఆదేశించారు.

**రైతులతో ముఖాముఖి....**

తనిఖీల అనంతరం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశమై వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ధాన్యం తడవడం, కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావచ్చనే ఆందోళన వ్యక్తం చేసిన రైతులకు ఆయన ధైర్యం చెప్పారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతుల శ్రమ వృథా కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

**వేగవంతమైన తూకాలు - సకాలంలో చెల్లింపులు...**

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, జాప్యాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా -మిగతా4లో..

# బూత్ బలంగా ఉంటేనే... పార్టీ బలంగా ఉంటుంది...

**ప్రతి బిఎల్ఏ ఓటు హక్కు**
**పరిరక్షణ కోసం సైనికుడిగా పని చేయాలి**
**ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా**
**ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహన**
**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి..**
**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్..**
**టిపిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి**



ఎస్ఐఆర్ ఓటర్ల సమగ్ర సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, జూన్14 ప్రభాతవార్త:** ఓటర్ల జాబితానే ఎన్నికల్లో విజయానికి తొలి అడుగని, బూత్ బలంగా ఉంటేనే, పార్టీ బలంగా ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర మండల కేంద్రంలోని కన్వెన్షన్ హాల్లో ఎస్సై ఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహన శిక్షణ శిబిరంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పార్టీ విజయానికి బూత్ స్థాయి కార్యకర్తలే వెన్నముక్క అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వార్డులు, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, కచ్చితత్వంతో రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని, వివరాల్లోమార్పులు ఉంటే సవరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కల్పించేలా బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్‌ను ఎవరు తేలికగా తీసుకోవద్దని, ఇప్పటివరకు ఓట్లు వేశాం కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, రేపు మన ఓటే జాబితాలో లేకుండా చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల పేరుతో జరిగిన అవకతవకల కారణంగా ముఖ్యమంత్రులుగా పనిచేసిన నాయకులే తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఎస్ఐఆర్ సందర్భంగా ప్రతి బిఎల్ఎఓటు హక్కు పరిరక్షణ కోసం సైనికుడిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఓటు చోరీ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత లేకపోవడంపై చేస్తున్న పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీ కోసమే కాదని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమని అన్నారు. ప్రజల ఓటుహక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. బిఎల్ఎలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదు మారిన, చిరునామాల సవరణ, తొలగించబడిన పేర్ల గుర్తింపు, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్ ఐ ఆర్ ద్వారా బిజెపి చేస్తున్న కుట్రలను, క్షేత్రస్థాయిలోనే తిప్పి కొట్టి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, మాట్లాడుతూ ప్రతిబూత్‌లో పార్టీకార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యకర్తల కృషి, అంకితభావంతోనే పార్టీ ప్రజల్లో మరింత ఆదరణ పొందుతుందని పేర్కొంటూ, బూత్ కమిటీలను సమర్థవంతంగా నిర్వహిస్తే రాబోయే ఎన్నికల్లో పార్టీ ఘన విజయాన్ని సాధిస్తుందని, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. మృతులు, డూప్లికేట్ పేర్లు, చిరునామా, మార్పులు వంటి అంశాలను పరిశీలించి, జాబితాను నవీకరించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య బలోపేతానికి తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుగ్గా పాల్గొని, ధ్రువీకరించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు మూలస్తంభమని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం బాధ్యత అని, దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి ఓటుకు ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే, వెంటనే సవరించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి ఓటు విలువైనదని, ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన పాలనకు తోడ్పడవచ్చు అని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి అన్నారు. ఈ శిక్షణా తరగతులలో బిఎల్ఏ ట్రైనర్ అమరేందర్ రెడ్డి, టిపిసిసి కోఆర్డినేటర్ పృథ్వి చౌదరి, పాల్గొని, ఏజెంట్లకు సాంకేతిక క్షేత్రస్థాయి విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రమైన -మిగతా4లో..



విద్యార్థులకు స్కాలర్ షిప్ అందిస్తున్న సినీ నటుడు విజయ్ దేవరకొండ

# ఆత్మవిశ్వాసం పెంచడం కోసం ఈ ప్రోత్సాహకాలు

**లక్ష్యంతో చదివితే సాధించనిది లేదు**
**సినీ నటుడు విజయ్ దేవరకొండ**

**అచ్చంపేట, జూన్, 14 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ప్రోత్సాహం పెంచడమే ఈ ప్రోత్సాహకాలు అందించడం అని సినీ నటుడు విజయ దేవరకొండ అన్నారు. ఆదివారం బల్మూరు మండలం తుమ్మన్ పేట గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుకార్యక్రమంలో మాట్లాడారు మూడు నెలల క్రితం రష్మిక మందన, విజయ్ దేవరకొండల వివాహం అనంతరం అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి పదవ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తామన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతుల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకు సాధించిన 188 మంది విద్యార్థినీ విద్యార్థులకు నటులు విజయ్ దేవరకొండ రష్మిక దంపతులు దేవరకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులు మాధవి గోవర్ధన్ రావు, ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ డీఈఓ రమేష్ కుమార్ కలిసి మొదటి ర్యాంకు సాధించిన వారికి రూ.10 వేలు, రెండవ ర్యాంకు సాధించిన వారికి రూ.5 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ కన్న ఊరును మరవని విజయ్ రష్మిక దంపతులకు వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను గర్వంగా ఫీల్ అవుతున్నానన్నారు. శ్రీమంతుడు సినిమాలో -మిగతా4లో..



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి

# కార్యకర్తలే కీలకం..

**ప్రతి గడపకూ సంక్షేమం**
**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
**గత పదేళ్లతో పోలిస్తే**
**రెండున్నర ఏండ్లలో ఎంతో అభివృద్ధి చేశాం**
**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్న పథకాలను ప్రతిగడపకు తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని ఓం కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, కార్పొరేటర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణతరగతుల కార్యక్రమానికి ఆయన -మిగతా4లో..

## యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

**ఖిల్లా ఘనపురం జూన్ 14, ప్రభాతవార్త:** ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడిన వారికి ప్రాణదానం చేస్తుందని ఈ రక్తాన్ని లేబరేటరీలో తయారు చేయలేమని లేదా కొనుగోలు షాపులో కొనలేమని ఆయన అన్నారు. ఒకరి ప్రాణం నిలపాలంటే మరొకరు రక్తాన్ని దానం చేయాల్సిందేనని ప్రాణాపాయంలో ఉన్న ఎంతోమందికి రక్తదానం జీవనదాతగా మారుతుందని యువశక్తి ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో ముందుంటుందని అధ్యక్షులు కాగితాల మధు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిట్యాల లింగస్వామి, శ్యామ, శ్రీనివాసులు, రాములు, ఆగారం ప్రకాష్ ,గ్రామ యువకులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న గ్రామ యువకులు

## సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### అమరచింత మండల నూతన సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజేందర్ రెడ్డి

**అమరచింత జూన్ 14. ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అమరచింత మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామంలో నిర్వహించిన సర్పంచుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలని ఆయాగ్రామాల సర్పంచులుపార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. అనంతరం అమరచింత మండలం నూతన కమిటీని ప్రకటించారు. అమరచింత మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా రాజేందర్ రెడ్డి నందిమల్ల సర్పంచ్, ఉపాధ్యక్షులుగా మస్తెమ్మ కొంకన్ వాని పల్లె గ్రామ సర్పంచ్, కోశాధికారి మల్లారెడ్డి కృష్ణం పల్లి గ్రామ సర్పంచ్, కార్యదర్శులు సాంబశివుడు మస్తీపూర్ గ్రామ సర్పంచ్, బాలయ్య పామిరెడ్డి పల్లె గ్రామ సర్పంచ్ వీరితోపాటు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.


నందిమల్ల గ్రామంలో సర్పంచుల సమావేశం

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పిట్ల శేఖర్

**కోయిలకొండ జూన్ 14, ప్రభాతవార్త:**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మండల కేంద్రమైన కోయిలకొండకు చెందిన పిట్ల శేఖర్ ను ఆ పార్టీ అధిష్టానం ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది. నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎంపికైన పిట్ల శేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను గుర్తించి నన్ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, నారాయణపేట నియోజకవర్గం ఇంచార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి లకు ఎప్పటికీ రుణపడి ఉంటానని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నా ఎంపికకు సహకరించిన మండల కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, పార్టీ అభిమానులకు, అభ్యుదయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి నన్ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎంపిక చేసిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు కృషి చేస్తానన్నారు. పార్టీ అధిష్టాన ఆదేశాల మేరకు పార్టీ నేతలను, పార్టీ కార్యకర్తలను అందరిని కలుపుకొని వెళ్లి పార్టీ కోసం పని చేస్తానన్నారు.



## ఆత్మకూరులో ఉమ్రాయాత్రికులకు ఘన సత్కారం

**ఆత్మకూర్ జూన్ 14,ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఆదివారం రోజు ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న ఉమ్రాయాత్రికులకు ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ పవిత్ర క్షేత్రమైన మక్కా ఉమ్రాయాత్రలకు వెళ్లే భక్తులు ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం యుద్ధోన్మాదంతో మానవుల జీవితాలను అతలాకుతలం చేస్తున్న విషయాన్ని గుర్తించి ఉంరాయాత్రికులు మక్కాలో ప్రపంచ శాంతి మరియు సుస్థిరత ఏర్పడేందుకు అల్లా కరుణించాలంటూ ప్రార్థనలు చేయాలని ఆయన సూచించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన మీసేవ నిర్వాహకులు ఒక దినపత్రికకు విలేఖరిగా పనిచేస్తున్న రఫీ కుటుంబ సభ్యులు చిన్నచింతకుంట మాజీ కోఆప్షన్ సభ్యులు మహమూద్ కుటుంబ సభ్యులు తదితరులు ఆదివారం రోజు ఉమ్రాయాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణానికి చెందిన పలువురు ముస్లిం మత పెద్దలు ప్రముఖులు ఘనంగా పూలమాలలో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జావీద్, నూర్ అహ్మద్ తదితరులతో పాటుగా పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.


ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న వారిని మార్కెట్ కమిటీ చైర్మన్ ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

## రక్తదానం చేసి... ప్రాణదాతలుగా నిలవాలి

### మాన్వి ఆస్పత్రి చైర్మన్ నరేష్ రెడ్డి

**కోయిలకొండ జూన్ 14, ప్రభాతవార్త:** సమాజంలోని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మాన్వి ఆసుపత్రి చైర్మన్ నరేష్ రెడ్డి రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన కోయిలకొండలోని మాన్వి ఆసుపత్రిలో రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ మన జిల్లాలో జాతీయరహదారులు ఉన్నందువలన ఎక్కడో ఓచోట ప్రమాదాలు ప్రతినిత్యం సంభవిస్తున్నందున, ప్రమాదాల బారిన పడిన వారిని కాపాడుకునేందుకు రక్తం ఎంతో అవసరం అన్నారు. ఆపద సమయాలలో,అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో ముఖ్యమన్నారు. రక్తదానం చేసి... మరొకరి ప్రాణాలను కాపాడుకునేందుకు మనం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు, వైద్యులు, వైద్య బృందం ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దృశ్యం

## పెద్దమ్మ తల్లి పండగకు భారీగా విరాళాల సేకరణ

### మున్సిపల్ చైర్మన్... దేవాలయ కమిటీ అధ్యక్షులు....

**ఆత్మకూర్ జూన్ 14, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 30న నిర్వహించనున్న పెద్దమ్మ తల్లి పండగ నిర్వాహన కోసం ఆత్మకూరులోని ప్రముఖ వ్యాపారస్తుల నుండి భారీగా విరాళాలు సేకరిస్తున్నట్లుగా ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ నాగమణి పెద్దమ్మ తల్లి నిర్వహణ కమిటీ అధ్యక్షులు మొగిలి శ్రీధర్ గౌడ్ ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా తదితరులు ప్రభాతవార్తకు తెలిపారు. గడచిన 70 సంవత్సరాలుగా ఆత్మకూరు పట్టణంలో పెద్దమ్మతల్లి పండగ నిర్వహణ చేయలేకపోయారని ప్రస్తుతం నూతనంగా పెద్దమ్మ తల్లి గుడి పూర్తయిన సందర్భంగా ఈనెల 30వ తేదీన కనివిని ఎరుగని రీతిలో పెద్దమ్మతల్లి పండుగకు ఏర్పాట్లు జరుపుకుంటున్నట్లుగా వారు తెలిపారు. ఇందుకుగాను ఇప్పటికే పట్టణంలోని ప్రముఖ వ్యాపారస్తులందరూ లక్షలాది రూపాయల విరాళాలు అందజేశారని అంతేకాకుండా ఆత్మకూర్ పట్టణ శివారులోని వ్యవసాయ పొలాలకు చెందిన రైతులు ఎకరానికి 2000 రూపాయలు చొప్పున ఇవ్వడంతో పాటుగా ఆత్మకూరు పట్టణంలోని ప్రతి ఇంటికి వెయ్యి రూపాయల చొప్పున విరాళాలను సేకరించడమే కాకుండా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లుగా వారు తెలిపారు. గత రెండు రోజులుగా ఆత్మకూరు పట్టణంలో విరాళాల సేకరణకు వ్యాపారస్తులు మరియు రైతులు ప్రజలు విశేషంగా స్పందిస్తున్నారని వారు తెలిపారు.


విరాళాలు సేకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ కమిటీ అధ్యక్షులు

# ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్

### కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు

**అచ్చంపేట, జూన్,14 ప్రభాతవార్త:** శ్రీశైలం ఉత్తర ద్వారంగా వెలసిన ఉమామహేశ్వర క్షేత్రంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, ప్రకృతి సోయగాల నడుమ వెలసిన శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు దేవస్థాన అర్చకులు, ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం కలెక్టర్ కుటుంబ సమేతంగా ఆలయంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలలో పాల్గొని జిల్లాలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం అభివృద్ధి చెందాలని, జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కలెక్టర్ తల్లిదండ్రులు ,కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, స్వామివారి



ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్‌పాటిల్ కుటుంబసభ్యులు

తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యం, ఆధ్యాత్మిక వైభవం గురించి వివరించారు. నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఈ క్షేత్రం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిందని, ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందుతారని అర్చకులు వివరించారు. దర్శనం అనంతరం కలెక్టర్ ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను పరిశీలించి భక్తులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న చర్యలపై వివరాలు సేకరించారు. ఆలయ పరిసరాల్లో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదిస్తూ కొంతసేపు గడిపారు. ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక ప్రశాంతత, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం సందర్శన కలెక్టర్ కుటుంబ సభ్యులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీరం మాధవరెడ్డి, పాలక మండలి సభ్యుడు పవన్ కుమార్, పూజారులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షంలోనే మండలంలో పర్యటించిన కలెక్టర్

**ఉప్పునుంతల, జూన్ 14 ప్రభాతవార్త :** ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంలోనే నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మండలంలో పర్యటించారు. మండలంలో సొసైటీ బ్యాంకు, ఐకెపి వారు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి భారీ ఎత్తున వరి ధాన్యం కొనుగోలు విక్రయించారు. కొనుగోలు చేసిన వరి ధాన్యం కేంద్రం లోనే కోనుగోలు చేసిన ధాన్యం లారీ ఏజెన్సీ లారీలు రాక తరలింపులో తీవ్ర జాప్యం జరిగింది. గత నాలుగురోజుల నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం రావడంతో కొనుగోలు చేసిన ధాన్యం తడిసి ముద్దవుతుంది. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేంతవరకు రైతుల బాధ్యత అని అప్పగించడంతో రైతులు అమ్ముకున్న దాని కన్నా తరలించేంత వరకు కేంద్రాల వద్ద పడిగాల్పులు కాస్తున్నారు. దీనికి తోడు ట్రాన్స్‌పోర్ట్ ఎప్పటికప్పుడు లేకపోవడంతో వర్షాలకు రైతులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విషయం తెలుసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదివారం ఉదయాన్నే వర్షంలోనే పర్యటించారు. ఓ పక్క వర్షం కురుస్తున్న కోనుగోలు చేసిన వరి ధాన్యం తరలింపులో ఎందుకు జాప్యం జరుగుతుందని అధికారులను ప్రశ్నిస్తూ, మరోపక్క రైతులకు భరోసా కల్పిస్తూ ధాన్యాన్ని తక్షణమే తరలించాలని ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలోనే రైతుల సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క రైతు ఒక విధంగా బాధను వెలిబుచ్చారు. పెద్దాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి కేవలం ఏజెన్సీ నుంచి ఒకే లారీ పంపించడంతో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు సొంత ఖర్చుతో మూడు లారీల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం జరిగిందని కలెక్టర్ కు వివరించారు. కొంతమంది రైతులు మా వ్యవసాయ పొలాల్లో ఉన్న ధాన్యాన్ని విక్రయించడానికి గన్ని బ్యాగులు ఇవ్వాలని కోరగా కలెక్టర్ తిరస్కరిస్తూ ఎంత ధాన్యం ఉన్నా కొనుగోలు కేంద్ర వద్దకు తీసుకు రావాల్సిందేనని కరాఖండిగా తేల్చి చెప్పారు.


వర్షంలోనే మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్

## సర్జికల్ క్యాంప్‌తో పేదలకు ఎంతో మేలు

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నే లక్ష్మీనారాయణ

**ఉప్పునుంతల, జూన్ 14 ప్రభాతవార్త :** పేదల ఆరోగ్యానికి సర్జికల్ క్యాంప్‌తో ఎంతో మేలు జరుగుతుందని, నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 25 వ తేదీ నుంచి నిర్వహించనున్న మెగా సర్జికల్ క్యాంపును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నే లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంప్ ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో హెర్నియా, గర్భాశయ సంబంధిత శస్త్రచికిత్సలు (హిస్టరెక్టమీ) తదితర పలు రకాల శస్త్ర చికిత్సలను నిపుణులైన వైద్యులచే ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నల్లమల్ల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఈ కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలకు దూరమవుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు మెగా సర్జికల్ క్యాంప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైన రోగులు ముందస్తుగా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు తీసుకొని అవసరమైన చికిత్సలు పొందాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలకు ప్రజలు సహకరించి విజయ వంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది, మాజీ సర్పంచ్ కర్నే లక్ష్మీనారాయణ కోరారు.


అధ్యక్షుడు కర్నే లక్ష్మీనారాయణ

## విద్యా వ్యాపార మాఫియా దోపిడికి అడ్డుకట్ట వేయాలి

### ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి.. ఎం.డి.కుతూబ్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి

**అమరచింత జూన్ 14,ప్రభాతవార్త:** రాజ్యాంగ ప్రాథమిక హక్కులో భాగమైన ఉచిత విద్యను అంగడి సరుకుగా మార్చి కొత్త కొత్త టెక్నాలజీ పేర్లతో పవిత్రమైన విద్య వ్యవస్థను స్వార్థపూరిత కుట్రలతో విద్యను వ్యాపారం చేసిన విద్య మాఫియా దోపిడీలపై ప్రభుత్వం తక్షణమే అడ్డుకట్ట వేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. కుతూబ్ డిమాండ్ చేశారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)అమంచింత మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.డి కుతూబ్ మాట్లాడుతూ: కేజీ నుండి పేజీ వరకు ఉచిత విద్య అనే పాలకుల నినాదం కేవలం మాటలకే పరిమితం అయ్యాయని, విద్య హక్కు చట్టంలోని సూత్రాలు, ఫీజుల నియంత్రణ జీవోలు కేవలం పరిపాలన శాఖల పేపర్లకు మాత్రమే పరిమితం చేశారని మండిపడ్డారు. నాణ్యమైన విద్య పేరుతో ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్డు అదుపు లేకుండా ఫీజులు దండుకుంటున్న విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కుతు వేసవిలోనే ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులకు టార్గెట్లు పెట్టి ఇంటింటా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై, ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా గెలుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై ఎన్ని కేసులు నమోదు చేశారో, ఎన్ని విద్య సంస్థలు సీజ్ చేశారో తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు జలగళ్ల ఫీజుల దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. జీవో నెంబర్ ఒకటి ప్రకారం ఏ ఒక్క ప్రైవేటు విద్యా సంస్థ నడవడం లేదని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులు దోపిడీ ఆపకపోతే ప్రత్యక్ష దాడులకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మహమూద్, దయాకర్, అరుణ్, మల్లేష్ యాదవ్, శ్రీకాంత్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం లో మాట్లాడుతున్నా ఎం.డి కుతూబ్

## గోపాల్‌పేటలో జ్ఞాన చైతన్య యాత్ర విజయవంతం

### కాంగ్రెస్ మండల అధ్యక్షులు గగనం నరహరి

### మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మంద సత్యశీల రెడ్డి

**గోపాల్ పేట, జూన్ 14 ప్రభాతవార్త :** సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం డా. మల్లు రవి చేపట్టిన "మహనీయుల జ్ఞాన చైతన్య యాత్ర" ఆదివారం గోపాల్‌పేట మండల కేంద్రానికి చేరుకుంది. యాత్ర బృందానికి స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు గగనం నరహరి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మంద సత్యశీల రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కళాకారుల బృందం అంబేద్కర్, జగ్జీవన్ రావు, అబ్దుల్ కలాం, పూలే దంపతులు, సేవాలాల్ మహరాజ్ వంటి మహనీయుల ఆశయాలపై సామాజిక గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారు. "మహనీయుల ఆలోచనలు ప్రతి ఇంటికీ చేరాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు చైతన్యవంతులు కావాలి" అనేదే యాత్ర లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శివన్నయూత్ కాంగ్రెస్ ఆర్టిఐ చైర్మన్ కొంకి రమేష్, ఏదుల మండల అధ్యక్షుడు పందెం సుఖేందర్, అడ్వకేట్ ఆంజనేయులు, సుధాకర్ రావు, నాగరాజు, రవి, మధు, బత్తుల శ్రీశైలం, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.


జ్ఞానచైతన్య యాత్రలో కాంగ్రెస్ నాయకులు

## కేజీబీవీలో గెస్ట్‌ఫ్యాకల్టీ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### - మండల విద్యాధికారిణి ఉషారాణి

**భూత్పూర్, జూన్ 14, ప్రభాతవార్త :** భూత్పూర్‌లోని కస్తూరీభా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో గెస్ట్‌ఫ్యాకల్టీగా వివిధ సబ్జెక్టులలో ఖాళీలుగా ఉన్న పోస్టులలో అధ్యాపకుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారిణి ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, కామర్స్ , సివిక్స్ , ఎకనమిక్స్ సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ బీఈడి అర్హతలుండాలని, ఇదేవిధంగా ఎంపీహెచ్‌డబ్లు పోస్టుకు ఎంఎస్‌సి/బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి పదేళ్ల అనుభవం ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 15లోపు తమ కేజీబీవీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని ఎంఈఓ ఉషారాణి సూచించారు.

## పిడుగు పడి గేదె మృతి


పిడుగు పడి మృతి చెందిన గేదె

**కెటిదొడ్డి జూన్ 14, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా మండల పరిధిలోని మల్లాపూరం తాండ లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మల్లాపూరంతాండ కు చెందిన మూడవత్ పంపానాయక్ తండ్రి మూడవత్ గోవింద నాయక్ లకు చెందిన గేదె ఆదివారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడి గేదె మృతి చెందిందని రైతు తెలిపారు. దీని విలువ సుమారు రూ" లక్ష మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. ముర్రా గేదె ను పోషిస్తూ రోజుకు ఉదయం"5"లీటర్ల పాలు, సాయంత్రం"5" లీటర్ల పాలు వ్యాపారం జీవనాధారం పై ఆధారపడి నా తమకు నష్టం తీవ్ర ఆర్థిక భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఘటనను పరిశీలించి, నష్టపోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం తరఫున తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

## సినీ తారాల మీదుగా నగదు బహుమతి అందజేత


నగదు ప్రోత్సాహం అందుకుంటున్న విద్యార్థులు

**ఉప్పునుంతల, జూన్14 ప్రభాతవార్త:** సినీతారాల మీదుగా ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదువుకున్న విద్యార్థులు 9,10 తరగుతులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం విజయ్ దేవరకొండ చేతుల నగదు బహుమతి అందుకున్నారు. మండలంలోని వెల్టూర్, పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతల, కంసానిపల్లి, పెనిమిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీఅధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్, పిఎం శ్రీజిల్లా పరిషత్‌ఉన్నతపాఠశాల హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, వెల్టూర్ హైస్కూల్ హెచ్‌ఎం. ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌ను కలిసిన ప్రాజెక్టు డైరెక్టర్

**మహబూబ్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని విద్యుత్‌సౌధలో ప్రభుత్వవిప్ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జిల్లాకేంద్రంలోని విద్యుత్ సౌధను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ (ఐటి) శివాజీ, డిఇ ఆపరేషన్ (జడ్చర్ల) చంద్రమౌళి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించగా, ప్రజలకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

## సేవా దృక్పథంతోనే ముందుకెళ్తున్నా..

**బిఆర్ఎస్ నాయకులు మందడి సరోజిరెడ్డి**

**చిన్న చింతకుంట, జూన్ 14 ప్రభాతవార్త ;** సమాజసేవయే దృక్పథంతో ముందుకు సాగుతున్నానని బిఆర్ఎస్ నాయకులు మందడి సరోజిరెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవమైన శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారి ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో కులమతాలకు అతీతంగా అన్నిదేవాలయాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. ఆపదలో ఉండే వారికి తన వంతు సహకారం అందిస్తున్నామన్నారు. సేవ మార్గమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల గుండెల్లో ఉండాలన్నదే తమ ధ్యేయమన్నారు. విశ్వబ్రాహ్మణులు అడిగిన వెంటనే లక్ష రూపాయల విరాళాన్ని అందజేయడం అభినందనీయమని మాజీ సర్పంచ్ మోహన్ గౌడ్ కొనియాడారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మం ఆలయనిర్మాణానికి తనవంతు సహకారం అందించాలని కోరిన వెంటనే లక్ష రూపాయలు విరాళాన్ని అందించడంపై విశ్వబ్రాహ్మణులు మందడి సరోజిరెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు కొన్నూరు శ్రీనివాసులు చారి, ఉపాధ్యక్షులు సుదర్శన చారి, ఆంజనేయులు చారి, శ్రీనివాసులు చారి, భానుమూర్తి, విష్ణు చారి, పరదీపూరు శ్రీనివాసులు చారి, కమ్మరి శ్రీనివాసులు చారి, మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.


లక్ష రూపాయల విరాళాన్ని అందజేస్తున్న సరోజిరెడ్డి

## పిన్న వయస్సులో.. ఉన్నత పదవి

**హర్షం వ్యక్తం చేసిన బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**బాలానగర్, జూన్ 14 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని మోతి ఘనపూర్ గ్రామ ఉపసర్పంచ్ కాగుల ప్రవీణ్ కుమార్ యాదవ్‌కు జిల్లాస్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ నియామక కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు కార్తీక్ పాల్గొని ప్రవీణ్ కుమార్ యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. చిన్నవయసులోనే జిల్లాస్థాయి పదవిని చేపట్టిన ప్రవీణ్‌కుమార్ యాదవ్‌కు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలి యజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ యాదవ్ జిల్లా ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాస్థాయి బాధ్యతలు దక్కడంపై ప్రవీణ్ కుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేస్తూ.. ఉపసర్పంచుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పనిచేస్తానని తెలిపారు.


నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

## పేటలో నమో జెన్‌జీ కాన్‌క్లేవ్ సన్నాహక సమావేశం

**నారాయణపేట, జూన్ 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో నమో జెన్ జీ కాన్‌క్లేవ్ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ యువ మోర్చా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నితిన్ నందకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నందకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యంగా యువతకు దేశం పట్ల, ప్రజాస్వామ్య పరిపాలన పట్ల అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. యువతను దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేసేలా నమో జెన్‌జీ కాన్‌క్లేవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్ కుమార్, పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్, రాష్ట్ర నాయకులు ప్రవీణ్, చంద్రశేఖర్ రెడ్డి, మోహన్, కార్తికేయ, ప్రకాష్, డి.మణి, మనీ మోదీ, పి. శివ, అంజి, ఆశిష్, రాజేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


నమో జెన్‌జీ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నితిన్ నందకర్

## దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం..

**మద్దూరు,జూన్ 14 ప్రభాతవార్త :** మద్దూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం దివ్యాంగుల ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ, ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు స్కూటీలు, త్రిచక్ర వాహనాలు, వీల్‌చైర్లు, ఇందిరమ్మ ఇళ్లు, గుర్తింపు కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే దివ్యాంగుల సేవా కేంద్రానికి స్థలం, భవనం మంజూరు కోసం కృషి చేస్తామని చెప్పారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఢిల్లీకర్ జనార్ధన్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, వైకల్యం ప్రతిభకు అడ్డంకి కాదని అన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధుబాబు, తెలుగు వెంకటేష్, నరేందర్, వెంకటేష్, గజలప్ప, సాయిబన్న, మున్నూరు వెంకటయ్య, తోక రాములు, మండల వికలాంగుల సంఘం ప్రతినిధులు, సమన్వయకర్త దస్తయ్యతో పాటు పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రముఖులు

## జిల్లా ఉపసర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శిగా కురుమూర్తి

**చిన్న చింతకుంట, జూన్ 14 ప్రభాతవార్త :** జిల్లా ఉప సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీని జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ ల సంగం అధ్యక్షులు బోట్ల కార్తీక్ ఆధ్వర్యంలో జిల్లా ఉపసర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపసర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గూడూరు గ్రామ ఉపసర్పంచ్ సిరిగిరి కురుమూర్తి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిరిగిరి కురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ఉప సర్పంచుల సమస్యల సాధనకై తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు .జిల్లా ఉపసర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు జిల్లాలోని ఉపసర్పంచ్ లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా ఉపసర్పంచుల ప్రధాన కార్యదర్శిని ఆయా గ్రామాల ఉపసర్పంచులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉండ్యాల ఉపసర్పంచ్ బండారు యేనా, అల్లిపూర్ గ్రామ ఉపసర్పంచ్ నిరంజన్, బండర్ పల్లి గ్రామ ఉపసర్పంచ్ దండు ఆంజనేయులు పాల్గొన్నారు.


జిల్లా ఉపసర్పంచుల ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

## ఇస్రో శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయం

**సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్**

**వనపర్తి, జూన్ 14, ప్రభాతవార్త :** ఇస్రోలో అంతరిక్ష శాఖ శాస్త్రవేత్త గా వెంకటేశ్వర్లు దాదాపు ముప్పై తొమ్మిది సంవత్సరాల పాటు సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఇస్రో శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు ను సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్‌గౌడ్‌ను ఆదివారం షాద్ నగర్ పట్టణం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ పనిని దైవంగా భావించి వృత్తి ధర్మాన్ని చిత్త శుద్ధితో నిర్వహించారని, ఏనాడు విధుల పట్ల నిరక్ష ్యం చూపలేదని కొనియాడారు. ఇస్రో సైంటిస్ట్ గా అంతరిక్షం డిపార్ట్ మెంట్ లో మాంచి పేరు సంపాదించుకొని మూడున్నర దశాబ్దాలకు పైగా సాగిన తన శాస్త్రవేత్త గా జీవితంలో ఉత్తమ వ్యక్తిత్వంతో బాధ్యతాయుతంగా పని చేశారని అన్నారు. ఆయన ఇస్రో అంతరిక్ష విభాగం కు అందించిన సేవలకుగాను భారత ప్రభుత్వం ఉన్నతాధికారుల ప్రశంసలూకూడా అందుకున్నారని వివరించారు. పలుస శంకర్ గౌడ్ శైలజ దంపతులు శ్రీ వెంకట్రాములు పద్మ దంపతులను శాలువ జ్ఞాపికలతో సత్కరించారు. ఈనాటి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఇస్రో శాస్త్రవేత్తను సన్మానిస్తున్న శంకర్ గౌడ్

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వాకిటి శ్రీధర్**

**వనపర్తి, జూన్14, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగుల మహాధర్నా జూన్ 16 వ తేదీన రీజనల్ మేనేజర్ ఆఫీస్ ముందు మహబూబ్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థలో 35సంవత్సరములు పనిచేసి రిటైర్డ్అయిన రోజున రావలసిన డబ్బులు మేము దాచుకున్నవి, 2017 సంవత్సరం అలాగే 2021సంవత్సరంలో పెంచిన జీతభత్యాల పెరుగుదలకు సంబంధించిన బకాయిలు ఇంతవరకు రాలేదు నేడు పదవి విరమణ పొందుతున్న వారి వరకు ఎలాంటి ఆర్థికపరమైన లావాదేవీలు జరపకుండానే రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఖాళీ చేతులతో పంపుచున్నారు ఇట్టి విషయాలపై అనేకపర్యాయాలు యాజమాన్యం పెద్దల దృష్టికి, ప్రభుత్వ పెద్దలు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లిన ఎలాంటి ప్రయోజనం నేటి వరకు కనబడలేదు. మొన్నటికి మొన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేసిన విషయం విద్యుత్మే ఇందులో భాగంగా యాజమాన్యం, ప్రభుత్వం సమ్మెకు వెళ్లిన నాయకులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం సమ్మె విరమింప చేయడం జరిగిపోయినది నెలలు గడిచిన ఈనాటి వరకు పరిష్కరించలేదు కనుక న్యాయమైన మాకు రావలసిన 2017, 2021 ఏరియర్స్ వెంటనే ఇప్పించాలని తేదీ 16మంగళవారం రోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఆర్ఎం ఆఫీస్ ఎదుట మహా ధర్నా కార్యక్రమం నిర్వహించ తలపెట్టాము. ఈ ధర్నా తర్వాతనైనా యాజమాన్యం విశ్రాంత ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వనపర్తి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం లో మీటింగ్ ఏర్పాటు చేయనైనది ఇట్టి మీటింగులో ఈ మధ్యకాలంలో పదవీ విరమణ పొందిన కొంతమంది ఉద్యోగులను సంఘంలోకి సంఘ గౌరవ అధ్యక్షులు వాకిటి శ్రీధర్ ఎక్స్ మున్సిపల్ వైస్ చైర్మన్ వారిని సాదరంగా సంఘంలోకి ఆహ్వానించి శాలువాతో సన్మానించడం జరిగినది వీరిలో ఎంఎ రహీం దీప్తి సూపర్డెంట్ మెకానిక్, సురేష్ డ్రైవరు, రాములు డ్రైవరు కురుమయ్య కండక్టర్ 35 సంవత్సరాల పైబడి సర్వీస్ చేసి పదవి వివరణ పొందిన వీరిని సంఘంలోకి ఆహ్వానించడం జరిగింది. సమావేశానికి తెలంగాణ రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రెటరీ కె. సత్యన్న అధ్యక్షత వహించారు. వనపర్తి అధ్యక్షులు రామ్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు రామచంద్రారెడ్డి, కార్యదర్శి అంజయ్య, కోశాధికారి ఉపేందర్, సహకార దర్శులు బివి రావు, నాగులాచారి, చాంద్ పాషా, గాంధీ, సాయి రెడ్డి, జీఎం కృష్ణ, జి.గోపాల్ రెడ్డి, కొత్తకోట రామకృష్ణ, బుచ్చన్న తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ఇందులో భాగంగానే తేదీ 18 న చలో బస్ భవన్ అక్కడ ఒకరోజు నిరాహార దీక్ష చేయుటకు సంకల్పించడం జరిగిందని తెలిపారు. అందుకు అందరూ సహకరించాలని విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని పిలుపునిచ్చారు.


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న వాకిటి శ్రీధర్

# నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

### - విద్యార్థుల రాకకు సర్వం సిద్ధం

**ఉప్పునుంతల, జూన్ 14 ప్రభాతవార్త :** వేసవి సెలవులు ముగియడంతో నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 25 నుంచి జూన్ 11 వరకు ప్రకటించిన వేసవి సెలవులు ముగియగా, ప్రభుత్వం జూన్ 15 నుంచి విద్యాసంస్థల పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టింది. కొత్త విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాలలు తిరిగిప ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు గత కొన్ని రోజులుగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల నమోదు ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, విద్యా సామగ్రి వంటి సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ అధిక సంఖ్యలో అడ్మిషన్లు సాధించేందుకు కృషి చేశారు. జూన్ 12న అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సన్నాహక సమావేశాలు నిర్వహించి పాఠశాలల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను సమీక్షి ంచారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సంబంధిత ఏజెన్సీలతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వేసవి సెలవుల కాలంలో మండలంలోని అధిక శాతం ఉపాధ్యాయులు జనగణన విధుల్లో పాల్గొన్నారు. జూన్ 9తో జనగణన ప్రక్రియ పూర్తికావడంతో ప్రస్తుతం విద్యా కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పాఠశాలల ఆవరణలను శుభ్రపరిచి, విద్యార్థులను ఆకర్షించేలా అలంకరణలు చేశారు. ప్రభుత్వం ఇప్పటికే కొత్త విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేసింది. త్వరలోనే విద్యార్థులకు యూనిఫారాలు, ఎడ్యుకేషనల్ కిట్ల పంపిణీ చేపట్టనున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. పాఠశాలలుప్రారంభమైనప్పటికీ మరో వారం రోజులపాటు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, నూతన విద్యా విధానంలో భాగంగా మండలంలోని పెనిమిళ్ళ ,ఉప్పునుంతల, తాడూరు, కంసానిపల్లి తదితర నాలుగు గ్రామాల్లో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పాఠశాలల్లో బోధన నిర్వహించేందుకు అవసరమైన బోధకులు, సహాయకుల నియామకానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేయగా, ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తయింది. త్వరలోనే వారు విధుల్లో చేరి చిన్నారులకు ప్రాథమిక విద్య అందించనున్నారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఉపాధ్యాయుల కృషి, పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని విద్యావర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.



పాఠశాలలో మరమతులు చేస్తున్న దృశ్యం

## తాపీ మేస్త్రీల సమ్మె ఉధృతం

**నిరసన తెలుపుతూ ర్యాలీ : అధ్యక్షుడు గాలిగూటి జగదీష్**


ర్యాలీగా వెళుతున్న తాపీ మేస్త్రీలు

**అచ్చంపేట, జూన్, 14 ప్రభాతవార్త:** తాపీ మేస్త్రీలను మాట్లాడిన వ్యక్తి తాపీ మేస్త్రీలకు క్షమాపణ చెప్పే వరకు నిరసన ఉధృతం చేస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గాలిగూటి జగదీష్ డిమాండ్ చేశారు. నాలుగవ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం మూకుమ్మడిగా ప్రధాన రహదారిపై భవన నిర్మాణ కార్యాలయం నుండి అమరుల స్తూపం వరకు అక్కడి నుండి నెహ్రూ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ తాపీ మేస్త్రీని కించపరిచే విధంగా మాట్లాడిన సెంట్రింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ క్షమాపణ చెప్పే వరకు మండలాల వారిగా జిలా, రాష్ట్రవ్యాప్తంగా నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షులు హరిచంద్ర, కోశాధికారి రామచంద్రయ్య, మాజీ అధ్యక్షులు సీమోన్, ఆనందు, వెంకటయ్య, ఎల్లి కంటి నిరంజన్, సాంబశివరావులు బుచ్చయ్య, శ్రీను, సూర్యం, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్ లో చేరుతున్న బిఆర్ఎస్ కార్యకర్తలు

**చిన్నచింతకుంట, జూన్ 14 ప్రభాతవార్త :** పర్దిపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆదివారం దమగ్నాపూర్ లో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాను వేసి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి వలసలు పెరిగాయన్నారు. 2019లో మరల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారం చేపడుతుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్, ఉపసర్పంచ్ నీరంటి నరసింహ, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తెలుగు వెంకటేష్ ,పార్టీ అధ్యక్షులు బురనప్ప, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సంచార జాతులకు సర్కారు వరం...

**రాష్ట్రంలో 51 బీసీ కులాలకు సంచార, విముక్త తెగలుగా గుర్తిస్తూ జీవో జారీ...**

**రాష్ట్రంలోని సంచార, అర్ధ సంచార, విము (డీనోటిఫైడ్) జాతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు**


మండ్ల దేవన్న నాయుడు

**వనపర్తి, జూన్ 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని సంచార, అర్ధ సంచార, విముక్త (డీనోటిఫైడ్) జాతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించిందని వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న 51 వెనుకబడిన వర్గాల (బీసీ) కమ్యూనిటీలను అధికారికంగా విముక్త, సంచార, అర్ధ సంచార తెగలు (డీఎన్‌టీ)గా గుర్తిస్తూ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ జీవో నంబర్ 10ని విడుదల చేశారు. దశాబ్దాలుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఆయా వర్గాల విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల అభివృద్ధికి ఈ నిర్ణయం సరికొత్త బాటలు వేయనుంది. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సుదీర్ఘ అధ్యయనం అనంతరం అందించిన సమగ్ర నివేదిక, సిఫార్సుల ఆధారంగా రాష్ట్ర క్యాబినెట్ ఈ కీలక నిర్ణయానికి ఆమోద ముద్ర వేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్న బీసీ ఏ బీసీఈ గ్రూపుల జాబితాను కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడిమేఘా రెడ్డి కి ప్రత్యేకత కృతజ్ఞతలు తెలుపుతూ ప్రభుత్వం గతంలో వాల్మీకి బోయలు ఎస్టీలో ఉన్నారు. వారిని తిరిగి ఎస్టి జాబితాలను పునరుద్ధరించాలని కోరారు. గుర్తింపు పొందిన 51 వర్గాల్లో అత్యధికంగా బీసీఏ గ్రూపునకు చెందిన 49 కమ్యూనిటీలు ఉండగా, బీసీఈ గ్రూపునకు చెందిన రెండు కమ్యూనిటీలు చోటు దక్కించుకున్నాయి. ఇందులో ప్రధానంగా, బాలసంతు, బుడబుక్కల వాల్మీకి బోయ, (శివ క్షత్రియ), దాసరి (భిక్షాటన చేసేవారు), గంగిరెడ్లవారు, జంగం, జోగి, కాటిపాపల, మేదరి, పాముల, పార్థి, పాంబల, వీరభద్రీయ, వడ్డెర (ఒడ్డె), మందుల, పరికముగ్గుల వంటి సంచార జాతులు ఉన్నాయి. మైనారిటీ వెనుకబడిన వర్గాలకు చెందిన ఫకీర్, బుడ్బుడ్కి, గుడ్డి ఎలుగువాళ్లు, తురక, గంటి ఫకీర్ వంటి కమ్యూనిటీలు కూడా ఈ డీనోటిఫైడ్ (డీఎన్‌టీ) జాబితాలోకి చేరాయి. ఆయా తెగలకు కేంద్ర, రాష్ట్రాల ప్రత్యేక పథకాలు, నిధులు, సంక్షేమ ప్రయోజనాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్లందరికీ రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారని దేవన్న నాయుడు తెలిపారు.

# పాంచజన్యం హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**దామరగిద్ద,జూన్ 14 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కాందేన్ పల్లి గ్రామంలో తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్) నాయకులు ఆదివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నారాయణ పేటజిల్లా అధ్యక్షుడుశ్రీనివాస్ మాట్లాడుతూ, పాంచజన్యం హామీల ద్వారా రాష్ట్రంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, నిరుద్యోగ సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం, మహిళా అభివృద్ధి వంటి అంశాలతో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు కల్వకుంట్ల కవిత నాయకత్వానికి అండగా నిలిచి, ఆమెను ముఖ్యమంత్రిగా చేసే వరకు పార్టీకి మద్దతు అందించాలని కోరారు. నారాయణపేట జిల్లా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. వర్షం కారణంగా కాందేన్ పల్లి గ్రామంలో నిర్వహించాల్సిన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వెల్లడించారు. త్వరలోనే కొత్త తేదీని ప్రకటించి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు పుల్లూరు శ్రీనివాస్ రావు, మండల అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, ఆశన్‌పల్లి నారాయణ రెడ్డి, ఆశన్‌పల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ జి. శ్రీనివాస్ గౌడ్, నరహరి, మెట్టు నర్సింహా, గవినోళ్ల జనార్దన్, వెంకట్రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు

# ఘనంగా జాతీయ కుట్టుమిషన్ దినోత్సవం...

**టైలర్ లను సన్మానించిన జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ రాకాసి లోక్‌నాథ్ రెడ్డి**

**వనపర్తి, జూన్ 14, ప్రభాతవార్త:** రాజీవ్ చౌరస్తాలో గల శిరిడి సాయి కాంప్లెక్, ప్రేమ్ టైలర్స్ షాప్ నందు అంతర్జాతీయ దినోత్సవ సందర్భంగా ముఖ్యఅతిథిగా జిల్లా జెడ్పిటిసి చైర్మన్ రాకాసి లోక్‌నాథ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గంధం నాగరాజు పాల్గొని ప్రేమ్ టైలర్ షాప్ నందు కుట్టు మిషన్ కు పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి కేక్ కట్ చేసి కుటు మిషన్ కుట్టే దర్జీలకు కుట్టుమిషన్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న కాలంలో టైలరింగ్ జీవనాధారం కోల్పోతున్నారని పెద్ద పెద్ద షాపింగ్ మాల్ లో రెడీమేడ్ బట్టలు కొంటున్నారని టైలర్ వృత్తి చేసే వారికి జీవనాధారం చాలా ఇబ్బందిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం టైలరింగ్ చేసే ప్రతి ఒక్కరికి జీవనోపాధి కొరకు ప్రభుత్వ సబ్సిడీ లోన్లు ప్రతి ఒక్క టైలర్ కు అందే విధంగా కృషి చేయాలని ప్రేమ్ టైలర్ యజమాని నాన మోని మన్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టైలర్స్ గిరి ప్రసాద్, నాగరాజు, మన్నెం, సి. కుర్మయ్య పాల్గొన్నారు.



టైలర్ లను సన్మానిస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి

## నూతన అధ్యక్షులతో నియామకం

**నారాయణపేట, జూన్14, ప్రభాతవార్త :** జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గపరిధిలోని మండలాలు, పట్టణానికి నూతన అధ్యక్షులను నియమించింది. పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలోపార్టీని ప్రజలకు చేరువచేయడం లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, మధు, డిజిసిఅధ్యక్షుడు కుంభంశివకుమార్ రెడ్డి, జిల్లాఅధ్యక్షులు ప్రశాంత్‌కుమార్ రెడ్డి, మార్కెట్‌చైర్మన్ శివారెడ్డి తెలిపారు. నూతన అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి నారాయణపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొత్త రవీంద్రరెడ్డి, దామరగిద్ద మండల అధ్యక్షుడిగా బల్ల హన్మంతు, ధన్వాడమండల అధ్యక్షుడిగా బగ్గరాజు, మరికల్ మండలఅధ్యక్షుడిగా బొక్కలహర్షవర్ధన్ రెడ్డి, కోయిలకొండ మండల అధ్యక్షుడిగా పిట్టశేఖర్, నారాయణపేట పట్టణఅధ్యక్షుడిగా కర్ర వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు నూతనంగాబాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు పార్టీఅభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షి ంచారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రిటైర్డ్ ఉపాధ్యాయుల సందేశం

**ధన్వాడ, జూన్ 14 ప్రభాతవార్త :** చదువుకున్న బడిని ఎప్పటికీ మరవకూడదని, ఆ పాఠశాల అభివృద్ధికి ప్రతి పూర్వ విద్యార్థి తన వంతు బాధ్యత తీసుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు రుక్మజి, భద్రయ్యలు సూచించారు. ఆదివారం ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా మనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను గుర్తుంచుకుని, దాని అభివృద్ధికి సహకరించడం మనందరి కర్తవ్యమని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, అనుభవాలను పంచుకున్నారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

## ఒంటరి అయిన చిన్నారి భవ్యశ్రీకి ఆర్థికసాయం

**పెద్దమందడి జూన్ 14 ప్రభాతవార్త:** పెద్దమందడి జడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాల 2005, 2006 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తోటి స్నేహితురాలి కూతురికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించారు. పెద్దమందడి మండలం దొడకుంటపల్లి గ్రామానికి చెందిన రేణుక పెద్దమందడి మండల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005,06లో పదో తరగతి చదివారు. నెల క్రితం అనారోగ్యంతో ఆమె మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఒంటరైన తన స్నేహితురాలి కూతురికి తమ వంతు ఏమైనా సహాయం చేయాలని అనుకున్నారు. కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్న స్నేహితులు తమతో పాటు చదువుకున్న స్నేహితురాలి కూతురు భవ్యశ్రీకి స్నేహితులందరికీ రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ నగదు మొత్తాన్ని భవ్యశ్రీ పేరు మీద బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేయాలని నిర్ణయించారు. భవిష్యత్తులో కూడా రేణుక కూతురు భవ్యశ్రీ కి చదువుల విషయంలో ఎలాంటి సహకారం కావాలన్నా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని చిన్నారికి ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో 2005 ,2006 బ్యాచ్ స్నేహితులు అందరూ పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా రాజశేఖర్

**నవాబుపేట, జూన్ 14 ప్రభాతవార్త :** నవాబుపేట మండలం ఉప సర్పంచ్ల అధ్యక్షునిగా గురుకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు డిప్యూటీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షునిగా నియమస్తూ ఉప సర్పంచ్ల సంఘం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల ఉపాధ్యక్షులుగా హనుమసానిపల్లి కేశవులు, ఉపాధ్యక్షులుగా దొబ్బలి కేశవ్, హన్మసాని పల్లి ప్రధాన కార్యదర్శిగా బ్యాగరీ ఆంజనేయులు, పోమాల్ కార్యదర్శిగా ఎం.డీ.హజార్ అలీ, నవాబ్ పేట్ కోశాధికారిగా, గోవు నర్సిములు ఇప్పటూర్, మండల అధికార ప్రతినిధి గా ముష్టి శ్రీను, జంగమయ్య పల్లి సలహాదారులు భీమారం శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారికి అప్పగించిన స్థానాన్ని క్రమశిక్షణ నిబద్ధత నిజాయితీతో ముందు ఉండి పనిచేస్తామని వారి సమస్యలపై చర్చించుకుని అందరి సమక్షంలో నిస్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకొని వారి శ్రేయస్సుకు పాటుపడతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ సర్పంచులు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం కమిషనర్ నుంచి ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు నోటీసు

**ఆర్టీఐ చట్టాన్ని నిరక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు కోరుతూ డిమాండ్**

**ధన్వాడ, జూన్ 14 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 13.08.2025న ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని ఎమర్జెన్సీ విభాగానికి సంబంధించిన ఒక నెల రోజుల రోజువారీ క్యూ రిజిస్టర్ వివరాలు, అలాగే మెడికో లీగల్ రిజిస్టర్ వివరాలు సహా మొత్తం ఐదు అంశాలపై సమాచారం కోరుతూ ఆర్టీఐ దరఖాస్తు సమర్పించామని చెప్పారు. అయితే, సంబంధిత అధికారులు ఎలాంటి సమాచారం అందించలేదని, దీనిపై 11.11.2025న మొదటి అప్పీల్ దాఖలు చేసినప్పటికీ పూర్తి వివరాలు ఇవ్వలేదన్నారు. అనంతరం రెండో అప్పీల్ దాఖలు చేయగా, సమాచార హక్కు చట్టం కమిషనర్ కార్యాలయం నుంచి ఉస్మానియా జనరల్ హాస్పిటల్ పౌర సమాచార అధికారి అప్పిలేట్ అధికారులకు నోటీసులు జారీ అయ్యాయని వెల్లడించారు. జూన్ 29న కమిషనర్ ఎదుట హాజరు కావాలని ఆదేశిస్తూ కేసు నెంబర్ 3533/ ఎస్ఐసి ఏఆర్/2026 కింద నోటీసులు అందినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని నిరక్ష ్యం చేస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధులకు రూ.4వేల పెన్షన్ అమలు చేయాలి

**అచ్చంపేట, జూన్ 14 ప్రభాతవార్త:** వృద్ధుల పెన్షన్ల పెంపు పై ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైంది అని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీనియర్ సీనియర్ సిటిజన్ సిటిజన్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం వృద్ధాప్య పెన్షన్లు రూ.2 వేల నుండి రూ. 4 వేలకు పెంచుతామని చెప్పి నేటికీ అమలు చేయకుండా హామీని విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలు అని ఆకారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన విధంగానే కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడంపై ఒకపక్క సంతోషం వ్యక్తం చేసిన వృద్ధుల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేసి వచ్చే నెల నుండి అమలు చేసే సంక్షేమ పథకాలలో వృద్ధుల పెన్షన్లు రూ. 4వేలు పెంచే విధంగా పునరాలోచన చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా నెల నెల వృద్ధాప పెన్షన్ జాప్యం లేకుండా అమలు చేయాలని పేర్కొన్నారు. వృద్ధులు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఇబ్బందులకు గురవుతున్న వృద్ధులను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల ముందు హామీ రూ.4000 పెన్షన్లు వెంటనే అమలు చేయాలని కోరారు.

## నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**పెద్దమందడి, జూన్ 14 ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని పెద్దమందడి మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నిధులకు కృషిచేసిన వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎప్పటికీ అర్హులైన లబ్ధిదారులకు అందిస్తూ వారికి ఎంతో తోడ్పాటును అందిస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం పెద్దమందడి మండల కేంద్రంలో ఎమ్మెల్యే మెగా రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సీఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నిరుపేదల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడుతుందన్నారు. ఈ సందర్భంగా పెద్దమందడి మండలంలో మొత్తం గ్రామాలలో సంబంధించి 24 మంది లబ్ధిదారులకు రూ.8 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ముఖ్యంగా నందిని తల్లి పార్వతికి ఒక లక్ష అరవై వేలు, పాము రెడ్డి పల్లికి చెందిన కావలి బాలయ్యకి ఒక లక్ష 6000 లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా చెక్కులు పొందిన లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మెగా రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ వైస్ చైర్మన్ రామ కృష్ణారెడ్డి, పెద్దమందడి గణపురం మార్కెట్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, సర్పంచులు గంగమ్మ, రవి, స్వరూప, మంజుల, శ్రీశైలం, రాములు, మాజీ సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరంలో భక్తుల సందడి

**అచ్చంపేట, జూన్,14 ప్రభాతవార్త:** శ్రీశైలం దేవస్థానానికి ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న ఉమా మహేశ్వర క్షేత్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ పైనుండి వస్తున్న జలపాతాలను చూడడానికి భక్తులు వివిధ ప్రాంతాల నుండి అధికసంఖ్యలో వస్తున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం జలపాతాల వద్ద భక్తులు చిన్నారులు సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. ఉమామహేశ్వరం దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలక మండలి చైర్మన్ భీరం మాధవరెడ్డి, సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## ఘనంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ర్యాలీ

**ఉప్పునుంతల, జూన్ 14 ప్రభాతవార్త :** భవన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం శ్రీ రామ తాపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తాఫీ కార్మికులు నిర్వహించిన సమ్మె విజయవంతంగా ముగిసింది. నేటి తాపీ కార్మికులు పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉప్పునుంతల మండల అధ్యక్షులు తాండ్ర మల్లేష్, గ్రామ తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షులు మూన్య, ప్రధాన కార్యదర్శి పరుశ రాములు, ప్రధాన కార్యదర్శి రక్త రామస్వామి గౌడ్, గౌరవ అధ్యక్షులు మేకల రామచంద్రయ్య, మిఠాయి మల్లయ్య, ఏసు సాలయ్య, మేకల కుర్మయ్య, శ్రీను, ఆంజనేయులు, చిన్న ఆంజనేయులు, తోటి కార్మికులు బొల్లె వెంకటయ్య, దోర్నాల శీను, బొల్లె శీను, కృష్ణయ్య, లక్ష్మయ్య, శ్రీను, సదగోడు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## దామరగిద్ద కాంగ్రెస్ అధ్యక్షుడిగా బర్ల ఆనంద్

**దామరగిద్ద, జూన్ 14 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బర్ల ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. ప్రశాంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బర్ల ఆనంద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డికి, మాజీ జిల్లా అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

## నేడు దోస్తు నమోదు చివరి రోజు

**అచ్చంపేట, జూన్,14 ప్రభాతవార్త:** నేడు దోస్తు మూడవ ఫేస్ చివరి తేదీ అని అని ఉమామహేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ దోస్తు 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫేస్ 3 రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, నమోదు చేసుకోవడానికి జూన్ 15, చివరి తేదీ అని శ్రీ తెలిపారు. ఇంకా దోస్తు లో నమోదు చేసుకోని విద్యార్థులు వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. దోస్తు ఫేస్ 3 విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశమని పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీ ఉమామహేశ్వర డిగ్రీ కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ, డైరీ సైన్స్, బిఎఫ్ ఎస్ ఐ, పొలిటికల్ మేనేజ్మెంట్‌లకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్య అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఎన్సిసి సౌకర్యం గల కళాశాలని ఆయన పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

# జిల్లాలో ముగింపు దశకు చేరుకున్న ప్రొక్యూర్మెంట్ ప్రక్రియ

**సవాళ్లను అధిగమించి వరి ధాన్యం సేకరణ పూర్తి**

**వనపర్తి జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కాశి విశ్వనథ్**

**రాష్ట్రవ్యాప్త ధాన్య సేకరణలో 12వ స్థానంలో వనపర్తి**

**మొదటిసారిగా 42 గోడౌన్లలో నిల్వ సౌకర్యం**

**డిఫాల్ట్ మిల్లర్లపై లీగల్ యాక్షన్**

**నాణ్యతా ప్రమాణాల (ఎఫ్ఎక్యూ) మేరకే తరుగు కటింగ్**

**తప్పుడు ఆరోపణలను నమ్మొద్దు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిసిఎస్ఓ కాశీ విశ్వనాథ్

**వనపర్తి, జూన్ 14, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా ముగింపు దశకు చేరుకుందని, ఎదురైన అన్ని రకాల సవాళ్లను అధిగమిస్తూ రికార్డు స్థాయిలో కొనుగోళ్లు పూర్తి చేశామని వనపర్తి జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కాశి విశ్వనాథ్ స్పష్టం చేశారు. ఆదివారం ఐడిఓసి లోని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ధాన్యం కొనుగోళ్ల పురోగతి మరియు ఎదురైన సమస్యలపై పూర్తి వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకుందని, ఇప్పటివరకు మొత్తం 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) కాశి విశ్వనాథ్ తెలిపారు. రాబోయే రెండు మూడు రోజుల్లో, అంటే సోమవారం నాటికి ఈ కొనుగోలు ప్రక్రియను వంద శాతం సకాలంలో పూర్తి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్య సేకరణలో వనపర్తి జిల్లా ప్రస్తుతం 12వ స్థానంలో ఉందన్నారు. యాదాద్రి, సిద్దిపేట, జనగాం వంటి జిల్లాలు ఇంకా భారీగా సేకరించాల్సి ఉండగా.. వనపర్తి జిల్లాలోనే అత్యంత వేగంగా ప్రక్రియ ముగుస్తోందని వివరించారు.

**42 గోడౌన్ల ఏర్పాటు...**

ఈసారి జిల్లాలో ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్లామని, హిస్టరీలో మొదటిసారిగా 42 గోడౌన్లను నిల్వ కేంద్రాలుగా వినియోగించుకున్నామని డీఎస్ఓ తెలిపారు. ఎవరైతే డిఫాల్ట్ మిల్లర్లు ఉన్నారో, వారిని నిల్వ పాయింట్లుగా మార్చి..పౌరసరఫరాల సంస్థ (సిఎస్‌సి) సిబ్బందిని నియమించి, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్‌డబ్ల్యుసి) ద్వారా పర్యవేక్షించామన్నారు. జిల్లా పరిధిలోని 62 జెన్యూన్ మిల్లులలో ధాన్యం దించామని, అవసరమైతే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా గోడౌన్లకు కూడా ధాన్యాన్ని పంపుతున్నామని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ ప్రస్తుతం 77శాతానికి చేరిందని, మిగిలిన 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఏ జిల్లాకు ఎంత ఇచ్చామనే పూర్తి క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ. 358 కోట్ల వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నగదును చెల్లించడం జరిగిందని తెలిపారు.

**లేట్ హార్వెస్టింగ్, రవాణా సవాళ్లు...**

గత ఏడాదితో పోలిస్తే ఈసారి 20 రోజులు లేట్ హార్వెస్టింగ్ (పంట ఆలస్యంగా రావడం) జరిగిందని తెలిపారు. గతంలో మే 5 నుంచే పంట రాగా, ఈసారి మే 24న మొదటి బండి లోడ్ అయిందన్నారు. వ్యవసాయ శాఖ (డిఏఓ) నివేదికల ఆధారంగానే కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేశామని, ఏప్రిల్ నెలలోనే అధికారులకు శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 8:30 నుండి 10 గంటల వరకు వేబెక్స్ ద్వారా తహసిల్దార్లు, ఏపీఎం లు, సీఈఓలు, మిల్లర్లు, కాంట్రాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు రెక్టిపై చేశామని చెప్పారు. అన్ లోడింగ్ పాయింట్ల వద్ద సమస్యలు తలెత్తకుండా అదనపు వాహనాలను రంగంలోకి దింపి రవాణాను వేగవంతం చేశామన్నారు. ఒకే వెహికల్ నెంబర్‌పై రెండు మూడు చోట్ల టెండర్లు వేశారనే ఆరోపణలపై డిటిఓతో పూర్తి విచారణ జరిపించామని స్పష్టం చేశారు.

**గన్నీ బ్యాగుల కొరతపై స్పష్టత...**

గన్నీ బ్యాగుల కొరతపై వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరిగిన మక్కల (మొక్కజొన్న) కొనుగోళ్ల కోసం లారీలు, గన్నీ బ్యాగులు డైవర్ట్ కావడం వల్లే కొంత గందరగోళం జరిగిందని, దానికి సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మార్కెట్ శాఖ, మార్క్‌ఫెడ్ డీఎం మొక్కల కొనుగోలు ప్రక్రియ చూసుకున్నారని డిఎస్ఓ తెలియజేశారు

**తరుగు, రైతుల అపోహలు...**

సాధారణంగా 100 కిలోల ధాన్యానికి 68 కిలోల బియ్యం రికవరీ ఇవ్వాల్సి ఉంటుందని, తాలు పర్సంటేజ్ ఎక్కువగా ఉన్నప్పుడే మిల్లర్లు తరుగు డిమాండ్ చేస్తారని వివరించారు. అయినప్పటికీ, సెంటర్ ఇన్చార్జిలు, మీడియా మిత్రులు రైతుల నుంచి ఫిర్యాదులు రాగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను క్షేత్రస్థాయికి పంపి, మిల్లర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కరించామని, బలవంతంగానైనా ధాన్యం దించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. చివరగా, 2023 యాక్షన్ ప్యాడీకి సంబంధించిన కొందరు మిల్లర్లు కోర్టు మెట్లు ఎక్కినందున కోర్టు పరిధిలో కలవు , వాటిని డీఎం సిఎస్‌సి పర్యవేక్షి స్తున్నారని తెలిపారు. బసవేశ్వర రైస్ మిల్‌కు సంబంధించి, ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశలో ఉండగా, సంబంధిత మిల్లు యాజమాన్యం ధాన్యం సేకరణకు అంగీకరించిన నేపథ్యంలో, రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం నిబంధనల మేరకు దాన్యం దిగుమతి చేయడం జరిగిందని తెలిపారు.

# నేటి నుంచి మోగనున్న బడిగంట

మొదటి పేజీ తరువాయి భాగం..

విద్యాశాఖడైరెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీచేయడంతో సోమ వారం నుంచి బడిగంట మోగనుంది. ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం ప్రీప్రైమరీ తరగతులు నిర్వహిస్తుండడంతో మూడేళ్ల పైబడిన బాలల్ని పాఠశాలల్లో చేర్చుకుంటున్నారు. ఇందుకనుగుణంగానే ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాలను ఎంపిక చేశారు. మండలంలోని నాలుగైదు పాఠశాలల్ని ఎంపిక చేసిన ప్రీప్రైమరీ నుంచి స్కూల్ ఫైనల్ విద్యవరకు వారిని ఖచ్చితంగా ప్రభుత్వ బడుల్లోనే చదివేలా కట్టుదిట్టమైన, పటిష్టమైన చర్యలు చేపట్టింది. ముందస్తుగా ఈ నెల ఒకటో తేదీ నుంచి బడిబాట నిర్వహించి బాలల్ని ఎన్‌రోల్ చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రభుత్వం ఈఏడాది 2026-27విద్యా సంవత్సరానికి ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించడంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రభుత్వ బడుల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేస్తుండంతో ప్రైవేట్ పాఠశాలలపై పెద్ద దెబ్బే పడిందని పలువురు మేధావులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికిని కొందరు విద్యార్థుల తల్లితండ్రులు ప్రభుత్వ బడుల కంటే ప్రైవేట్‌పైనే దృష్టిని సారిస్తూ ప్రైవేట్ బడుల్లో తమ పిల్లల్ని వేసేందుకు సన్నద్ధమౌతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఏదేమైనా ఈ సారి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీప్రైమరీ తరగతులు ప్రైవేట్ పాఠశాలలపై కొంత ప్రభావం చూపగలవన్న అభిప్రాయాలు మేధావుల నుంచి వ్యక్తమౌతున్నాయి. జూన్ 15న పాఠశాలలు తెరిచినా అమావాస్య, మరుసటి రోజు మంగళవారం అనె సెంటిమెంట్లను పాటించే కొందరు తల్లితండ్రులు తమ పిల్లల్ని తొలిరోజు, మరుసటి రోజు బడులకు పంపకపోవచ్చనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతోంది.

# ఆత్మవిశ్వాసం పెంచడం కోసం ఈ ప్రోత్సాహకాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

రీల్ హీరోమహేష్‌బాబు అయితే.. రీల్ అండ్ రియల్ హీరో విజయ్ దేవరకొండ, రష్మికలని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వారిది అచ్చంపేట ప్రాంతం కావడం ఈ ప్రాంత కోడలిగా రష్మిక దేవరకొండ కావడం చాలా సంతోషమని..ప్రభుత్వపాఠశాలల్లో చదువుకునే వారు అత్యధికంగా పేద బిడ్డలు ఉంటారని..వారిని ప్రోత్సహిస్తూ ఉపకార వేతనంఇవ్వడం సంతోషమన్నారు. అచ్చంపేట వెనుకబడిన ప్రాంతమని విద్యకు ఎంత చేసినా తక్కువేనని ఎంతో కష్టపడి ఉన్న స్థాయికి ఎదిగిన విజయ్ దేవరకొండ జాతీయస్థాయిలో మంచి పేరు గుర్తింపులు పొందారన్నారు. అచ్చంపేటలో విజయ్ దేవరకొండ దంపతులు ఇంటర్నేషనల్ స్కూల్ న ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. విజయ్ దేవరకొండ రష్మికలు మాట్లాడుతూ విద్యపైన ప్రతి విద్యార్థి ఫోకస్‌తో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవటం తేలిక అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు మంచి వాతావరణం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా రెండో స్థానం వచ్చిందంటే జిల్లాలోని ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు.. జీవితంలో కొన్నిసార్లు ఒడిదుడుకులు ఎదురవుతాయని వాటిని తట్టుకుని ముందుకెళ్లాలని సూచించారు. ఆడుతూ పాడుతూ కష్టపడి క్రమశిక్షణతో చదవాలన్నారు. ఇదేతీరును ప్రతి సంవత్సరం కొనసాగిస్తూ జిల్లా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. అంతకుముందు విజయ్ దేవరకొండ తల్లి మాధవి మాట్లాడుతూ మా సొంతూరు గట్టు తుమ్మెన్, చిన్న పిల్లల మీద ఉన్న ప్రేమతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇతరుల పట్ల గౌరవం క్రమశిక్షణ, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యార్థులు అందరూ గర్వపడేలా ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ పిఏ కన్నారావు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే కీలకం..

మొదటి పేజీ తరువాయి భాగం..

ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చేరువవుతూ వారి సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయించడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే ప్రతి కార్యకర్త కఠినంగా శ్రమించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలంటే వారి మధ్యలో ఉండి సేవ చేయడం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనతో పోలిస్తే, కేవలం రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి ఎంతో విశేషమని ఆయన వివరించారు. ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యా రంగ అభివృద్ధి వంటి అంశాలలో ప్రభుత్వం ముందంజలో ఉందని తెలిపారు. "దేశం ముందు - తర్వాత పార్టీ, పార్టీ ముందు - తర్వాత వ్యక్తిగతం" అనే సిద్ధాంతాన్ని ప్రతి కార్యకర్త హృదయపూర్వకంగా ఆచరించాలని ఆయన సూచించారు. ఈసిద్ధాంతంతో పనిచేస్తేనే నిజమైన ప్రజాసేవ సాధ్యమవుతుందన్నారు. వచ్చే రెండున్నర సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమని, ఈ సమయంలో ప్రతి కార్యకర్త ఆత్మవిశ్వాసంతో, క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి దూరదృష్టి, అభివృద్ధి దృక్పథం వల్లనే భారతదేశం బలమైన పునాదులపై నిలిచిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి సుభాష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, డిసిసి నాయకులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, రాములు యాదవ్, సాయిబాబా, అజ్మత్ అలి తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యానికి తక్షణ రక్షణ చర్యలు

మొదటి పేజీ తరువాయి భాగం..

వేగవంతంగా తూకాలు నిర్వహించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించడంతో పాటు రైతులకు చెల్లింపులు కూడా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూరియా కొరతపై రైతుల ఆందోళఈ సందర్భంగా రైతులు రాబోయే వర్షాకాల సాగు సీజన్‌కు అవసరమైన యూరియా ఎరువుల లభ్యతపై తమ ఆందోళనను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ విధానంలోనే యూరియా పంపిణీ జరిగేలా వ్యవసాయ శాఖ ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. అవసరమైన నిల్వలను ముందుగానే సమకూర్చి ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**వ్యవసాయ శాఖకు కీలక ఆదేశాలు...**

వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు అందించడంలో నిరక్ష ్యం వహించవద్దని కలెక్టర్ సూచించారు. వర్షాకాల వ్యవసాయ సీజన్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, రైతులకు అవసరమైన సేవలు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, రైతులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో పాటు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, ఉప్పునుంతల తహసీల్దార్ అద్దంకి సునీత, ఉప తహసీల్దార్ రమేష్ మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్, మార్కెటింగ్ శాఖ, సివిల్ సప్లైస్ శాఖ డిటి హేమ్లా నాయక్, ఐకేపీ ఎపిఎం బాలచందర్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎఇ బాల్ రాం నాయక్, మండల వ్యవసాయ శాఖ విస్తీరణ అధికారి ణి రాఘ సంధ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) బ్యాంకు సిఈఓ కొత్త రవీందర్ రావు, బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, జిపిఓ ఆంజనేయులు, ఎఆర్ ఐ సి.హెచ్ శివ, ఐకెపి సిసి పద్మ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ బలంగా ఉంటేనే... పార్టీ బలంగా ఉంటుంది...

మొదటి పేజీ తరువాయి భాగం..

శిక్షణా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్, కౌన్సిలర్లు ,మార్కెట్ యార్డ్ చైర్మన్లు, బిఎల్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

రోడ్డుమీద వర్షపు నీరు ప్రవహించే ప్రదేశం, కాజ్వే మీద వెళ్లే ప్రదేశం గుర్తించుకొని ప్రజలకు తగు జాగ్రత్తలు కల్పించాలని అన్నారు. గ్రామాల్లో గల విద్యుత్ స్తంభాలు వైర్లు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిష్కారి పరిష్కారం చేసే విధంగా తహశీల్దార్ లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ,రేపటినుండి పాఠశాలలు ప్రారంభం కానున్నందున, పరిసరాలను ఎంపిడిఓలు పారిశుద్ధ కార్మికులతో శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని, గ్రామ స్థాయి నుండి ఏమైనా సమాచారం వస్తే వాటిని మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులకు త్వరగా సమాచారం అందించేందుకు వీలుంటుందని, సమస్య త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని నిరక్ష్యం వహించే అధికారులకు శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## 20న జాతీయ లోక్ అదాలత్

మొదటి పేజీ తరువాయి భాగం..

ద్వారా అనేక న్యాయ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందే అవకాశం ఉందని ఆమె తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడానికి ఇది ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ చలానాలు, చిన్న చిన్న క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, రాజీకి అనుకూలమైన ఇతర కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సాధారణ కోర్టు ప్రక్రియతో పోలిస్తే తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో సమస్యలను ముగించుకునే అవకాశం ఈ విధానంలో ఉంటుందని చెప్పారు. ఇరు పక్షాల అంగీకారంతో శాంతియుతంగా వివాదాలను పరిష్కరించడం వల్ల సమయం, ధనం ఆదా కావడంతో పాటు సామాజిక సామరస్యానికి కూడా ఇది దోహదపడుతుందని వివరించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నకేసులకక్షి దారులు ఈఅరుదైన అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్య లకు త్వరితగతిన పరిష్కారం పొందాలని జిల్లా ఎస్పీ డి. జానకి సూచించారు. రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం వల్ల ఇరు పక్షాలకు ప్రయోజనం కలుగుతుందని, అందువల్ల జూన్ 20న నిర్వహించే రెండవ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## చేగువేరాను ఆదర్శం తీసుకోవాలి



**అమరచింత జూన్ 14. ప్రభాతవార్త :** నేటి యువత చేగువేరాను ఆదర్శం తీసుకోవాలని డివైఎఫ్ఐ వనపర్తి జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, డివైఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బి వెంకటేష్ అన్నారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా 98వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదలకు విద్య, వైద్యం కల్పించాలని అమెరిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తి అని వారు అన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసిన చేగువేరాను ఆదర్శం తీసుకొని ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు చంటి, ఆటో రాము, కర్ణ, శంకర్, రామ్ సాగర్, ఫయాజ్, అంజి, శివ, ఎద్దుల శ్రీను, రాము, రసూల్, జాంగిర్, ఇస్మాయిల్, వెంకీ, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.